# చరిత్రకెక్కిన చరితార్థులు
# భారతరత్న శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్

- వాసంతి మాఘుపు.

**(సెప్టెంబరు 5 వతేదీ శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవము (టీచర్స్ డే) సందర్భముగా ...)**

*మా చిన్నప్పుడు గురుపూజోత్సవము సందర్భముగా విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రములు కలిగిన స్టిక్కర్లు ఇచ్చి, విరాళములు సేకరించి, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు ఆర్థికముగా సహాయమును అందించేవారు. ఇంతకూ మనం గురుపూజోత్సవము, ఉపాధ్యాయ దినోత్సవము (Teachers' day) ఎప్పుడు జరుపుకుంటాము? తత్త్వవేత్త శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజున (సెప్టెంబరు 5 వ తేదీన) జరుపుకుంటాము. చరితార్థుల శీర్షికలో ఈసారి ఆయన గురించి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం! - || సం ||*

సన్నగా, పొడవుగా, బక్క పలచగా, విశాలమైన నుదురు, పొడవైన ముక్కు, పసుపు పచ్చని పట్టుకోటు, మెడ నుండి క్రింద వరకు గుండీలు, నల్ల అంచు ఉన్న తెల్లని తలపాగా, నల్ల అంచు ధోవతి, నల్లని చెప్పులు - ఈ వర్ణనతో ఒప్పే తత్త్వశాస్త్ర ప్రావీణ్యుడు శ్రీ రాధాకృష్ణన్.

నెల్లూరుకు, గూడూరుకు మధ్య సర్వేపల్లి అనే చిన్న ఊరి నుండి జీవనోపాధి వెదుక్కుంటూ ఓ బ్రాహ్మణ కుటుంబము తిరుత్తణి అనే గ్రామం చేరింది. సర్వేపల్లి నుండి వచ్చిన ఆ కుటుంబము ఇంటిపేరు సర్వేపల్లిగా స్థిరపడిపోయింది. వీరాస్వామి, సీతమ్మ దంపతులకు రెండవ సంతానముగా రాధాకృష్ణన్ 1888వ సంవత్సరము సెప్టెంబరు 5వ తేదీన జన్మించారు. అతని ప్రాథమిక పాఠశాల విద్యాభ్యాసము తిరుత్తణిలోను, ఉన్నత పాఠశాల విద్యాభ్యాసము తిరుపతిలోని "హెర్మన్ బర్గ్ ఎవాంజలికల్ లూథరిన్ మిషన్ స్కూలు"లోను జరిగింది. అతని చదువుకు, అతనికి వచ్చే ఉపకార వేతనము ఎంతగానో ఉపయోగపడేది. ఆయన ధనవంతులు, బీదవారు అనే తారతమ్యం లేకుండా అందరినీ ఒకే దృష్టితో చూసేవారు. విద్యావంతులు, పామరులు అనే బేధము చూపేవారు కాదు.

తరువాత కొంతకాలము వెల్లూరులో ఉండి చదువుకున్నారు. మద్రాసు (చెన్నై) మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. అనంతరము 1903 వ సంవత్సరము మేలో, ఎఫ్.ఏ. చదువుకునే రోజులలోనే అతని వివాహము జరిగింది. భార్యపేరు శివకాము. మిషనరీ సంస్థలు నడిపే విద్యాలయాలలో చదవడము

వలన, ఈ సమయములోనే బైబిలు చదవడం జరిగింది. దీనితో అతని మనస్సు భారతీయ తత్త్వశాస్త్రం వైపు మళ్లింది. వివేకానందుని ఉత్తరాలు చదివారు. భారతీయ వేదాంత గ్రంథాలను చదవాలనే తపన ప్రారంభమైంది. వినాయక దామోదర్ సావర్కర్ రచన 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం' అనే పుస్తకం చదివారు. 1904లో ఆర్ట్స్ పరీక్షలో ప్రథమశ్రేణిలో (డిస్టింక్షన్) ఉత్తీర్ణులు కావడము వలన అతనికి ఉపకార వేతనముతో పాటు, మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చదివే అవకాశము కూడా లభించింది. 1906లో బి.ఏ. పరీక్షలో మొదటి తరగతిలో ఉత్తీర్ణులయ్యారు.

బి.ఏ. లో ఉత్తీర్ణ లైన తరువాత న్యాయశాస్త్రం చదివాలని అనుకున్నా, అది ఖర్చుతో కూడినదని తలచి ఎం.ఏ. లోనే చేరారు. ఈ సమయంలో కుటుంబము గడవడానికి తోటి విద్యార్థులకు తత్త్వశాస్త్రం బోధించేవారు. ఈ సమయంలోనే బార్కెట్ వ్రాసిన "హిందూఇజమ్", విల్బర్‌నిట్జ్ వ్రాసిన "భగవద్గీత" గురించి, స్వామి అభేదానంద వ్రాసిన వేదాంత మతం మీద గ్రంథము చదవడం జరిగింది. ఆ గ్రంథాలపై పరిశీలన కొనసాగిస్తూ, ఎంతో సాధన చేసి, ఎం.ఏ. పట్టా కోసం "ది ఎథిక్స్ ఆఫ్ వేదాంత" (వేదాంతంలో నీతిశాస్త్రం) సిద్ధాంత గ్రంథం రాయడం జరిగింది. అది కళాశాలలోని విద్యావేత్తల ప్రశంసలను అందుకోవడమే కాక, ఒక స్థానిక ప్రచురణకర్త ద్వారా 1908లో ముద్రించబడింది.

అప్పటి రోజుల్లో విద్యార్థుల ప్రతిభనాధారముగా భారత ప్రభుత్వము ప్రతి సంవత్సరము ఉపకార వేతనము అందిస్తూ; ఇంగ్లండులోని ఆక్సుఫర్డులో గాని, కేంబ్రిడ్జిలోగాని చదువుకొనే అవకాశం ఇచ్చేవారు. రాధాకృష్ణన్ ప్రతిభను తెలిసిన కొంతమంది ఆ ఉపకార వేతనానికి దరఖాస్తు చేయుమని సలహా ఇచ్చారు. కాని కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మద్రాసులో ఉద్యోగ ప్రయత్నాలు చేసారు. చివరకు కళాశాలలో ఆచార్యునిగా పనిచేసే స్కిన్నర్, రాధాకృష్ణన్ ప్రతిభను వివరిస్తూ "ఇటీవలి కాలంలో మనకు లభించిన వ్యక్తులలో శ్రేష్ఠమైనవాడు, ఏదైనా కళాశాలలో ఉపన్యాసకుడిగా నియమించవచ్చు" అని ఇచ్చిన ఉత్తరము కారణముగా అతనికి సహాయ తనిఖీ అధికారిగా బాధ్యతలు అప్పగించబడ్డాయి. 1910 లో బోధనలో డిప్లమా కొరకు సైదాపేటలోని శిక్షణా సంస్థకు వెళ్ళాడు. శిక్షణకాలములో తక్కువ జీతమే రావడము వలన కుటుంబాన్ని పోషించడానికి తనకి లభించిన బంగారు పతకాలను కూడా అమ్మి వేయవలసి వచ్చింది. ఆదాయము కొరకు తీరిక సమయములలో ట్యూషన్లు చెప్పటం కొనసాగించారు. అతను సైకాలజీ మీద ఇచ్చిన ఉపన్యాసములను సంకలనం చేసి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయపు ప్రెస్ 1912లో పుస్తకరూపములో అచ్చువేసింది.

సన్నగా, పొడవుగా, బక్క పలచగా, విశాలమైన నుదురు, పొడవైన ముక్కు, పసుపు పచ్చని పట్టుకోటు, మెడ నుండి క్రింద వరకు గుండీలు, నల్ల అంచు ఉన్న తెల్లని తలపాగా, నల్ల అంచు ధోవతి, నల్లని చెప్పులు - ఈ వర్ణనతో ఒప్పే తత్త్వశాస్త్ర ప్రావీణ్యుడు శ్రీ రాధాకృష్ణన్. కళాశాల ఉపన్యాసకుడిగా

పనిచేస్తూనే; వేదాంతం, నీతిశాస్త్రం, తత్త్వశాస్త్రం మొదలైన విషయాలపై రచనా వ్యాసంగం కొనసాగించారు. ఈయన వ్యాసాలు "ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఎథిక్స్" అనే పత్రికలో ప్రచురించబడ్డాయి. ఈయన ఇంకా రాజమండ్రిలోను, మైసూరు విశ్వవిద్యాలయములోను, కలకత్తాలోని కింగ్ జార్జి 5 చక్రవర్తి పేరున ఉన్న ఆచార్య పీఠం అధిపతిగానూ పలు పదవులను అలంకరించారు. భారతీయ తత్త్వశాస్త్రంలో సాటిలేని వ్యాఖ్యాతగా ప్రసిద్ధి పొందారు. ఆయన ఉపన్యాసాలు స్పష్టంగా, విజ్ఞానాత్మకంగా ఉపయోగకరంగా ఉండేవి. ఆయన వ్రాసిన "భారతీయ తత్త్వశాస్త్రం" (ఇండియన్ ఫిలాసఫీ) లండన్‌లో ఓ కంపెనీ అచ్చువేసి ప్రాచుర్యంలోకి తీసుకువచ్చింది. ఈ గ్రంథము చాలా భాషలలోకి అనువదింపబడింది. దీనిలో భారతీయ సంస్కృతిని గురించి, వేదములు, ఉపనిషత్తుల గురించి, ద్వైత, అద్వైత సిద్దాంతముల గురించి, పశ్చిమ దేశాలలోని తత్త్వరీతులను గురించి విశ్లేషణను, విమర్శలను, ఇంకా ఎన్నో విషయాలను చర్చించడం జరిగింది.

ఒకసారి ఓ ఐ.ఏ.ఎస్. అధికారి రాధాకృష్ణన్‌తో "మీరు ఆక్సుఫర్డులోనో లేక కేంబ్రిడ్జిలోనో చదివి ఉంటే ఇంకా బాగా రాణించేవారు" అంటే, దానికి రాధాకృష్ణన్ "నేను అక్కడికి ఉపన్యాసకుడిగా మాత్రమే వెళతానుగాని, విద్యార్థిగా మాత్రం కాదు." అని ఆత్మ విశ్వాసముతో జవాబిచ్చారట. తదుపరి కాలంలో "ఆప్టన్ ఉపన్యాసాలు" ఇవ్వడానికి రాధాకృష్ణన్ లండన్‌లోని ఆక్సుఫర్డుకు ఆహ్వానింపబడ్డారు. 1926వ



సంవత్సరము జూన్ నెలలో ఇంగ్లండులో "బ్రిటిష్ సామ్రాజ్య విశ్వవిద్యాలయాల మహాసభ"లలో, సెప్టెంబరులో అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని "హార్వర్డు విశ్వవిద్యాలయం"లో అంతర్జాతీయ తత్త్వ శాస్త్ర మహా సభలలో పాల్గొనడానికి కలకత్తా విశ్వవిద్యాలయ ప్రతినిధిగా ఎన్నుకోబడి ఆయా ప్రదేశాలలో ఆయన ప్రసంగించడం జరిగింది. ఈ సందర్భములో "హిందూ జీవన దృక్పథం", "హిందూ విధానంలోని తాత్త్విక మూలాలు", "హిందూ మత తత్త్వం" మొదలైన విషయముల గురించి ఉపన్యసించారు.

1929 వ సంవత్సరములో మాంచెస్టరు కళాశాల విద్యార్థులకు ఉపన్యాసకుడిగా పదవిని అలంకరించారు. ఈ సమయములో "పరమార్థ జీవితతత్త్వం" (ఏన్ ఐడియలిస్ట్ వ్యూ ఆఫ్ లైఫ్) గురించి ఆయన హిబ్బరు ఉపన్యాసములలో ప్రసంగించడము జరిగింది. ఆయన బర్మింగ్ హామ్, ఆక్సుఫర్డు మొదలైన చోట్ల క్రైస్తవ మహాసభలలో కూడా అనర్గళంగా ప్రసంగించారు.

( తరువాయి భాగం విజయదశమికి వచ్చే సంచికలో ... )